క్లుప్తంగా

కంకర క్రషర్లను తరలించాలి


కంకర క్రషర్‌లో పర్యటిస్తున్న గ్రామస్తులు

జిన్నారం(పటాన్‌చెరు): కంకర క్రషర్‌లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే తరలించాలని దాదిగూడెం గ్రామస్తులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు గ్రామం సమీపంలోని కంకర క్రషర్లలో బుధవారం స్థానికులు పర్యటించారు. ఈ సందర్భంగా కంకర క్రషర్ల నిర్వాహకులతో మాట్లాడి ఇబ్బందులను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాలుష్యంతో పాటు అక్రమ బ్లాస్టింగ్‌లతో ఇళ్ల బీటలు వారుతున్నాయన్నారు. తక్షణమే కంకర క్రషర్‌లను తొలగించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

సీజనల్‌ వ్యాధులతో అప్రమత్తంగా ఉండండి


మాట్లాడుతున్న డాక్టర్‌ పురుషోత్తం

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): సీజనల్‌ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని న్యాల్‌కల్‌ పీహెచ్‌సీ వైద్యుడు పురుషోత్తం అన్నారు. మండల పరిధిలోని టేకూర్‌ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. దీంతో ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తాగునీరు, ఆహారం తదితర అంశాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రవీణ, ఏఎన్‌ఎం సుజాత ఆశావర్కర్‌ లక్ష్మి పాల్గొన్నారు.

పండగ సాయన్న త్యాగాలు మరువలేనివి


పండుగ సాయన్న విగ్రహావిష్కరణలో పాల్గొన్న నీలం మధు

పటాన్‌చెరు: నిజాం రజాకార్లకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల కడుపు నింపిన పోరాటయోధుడు పండగ సాయన్న అని కాంగ్రెస్‌ నేత నీలం మధు ముదిరాజ్‌ అన్నారు. మహబూబ్‌నగర్‌ జిల్లా హన్వాడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహావిష్కరణకు ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి ముదిరాజుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పండుగ సాయన్న స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

మరుగుదొడ్ల నిర్మాణం కూల్చివేత


పార్వతీశ్వరాలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ పాండు

జోగిపేట(అందోల్‌): పార్వతీశ్వరాలయంలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. ఎస్‌ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 16న ఆలయ ప్రాంగణంలో నిర్మాణం పనులు చేపట్టగా అదే రాత్రి కూల్చి వేశారు. స్థానికులే ఉద్దేశపూర్వకంగా ఈ నిర్మాణాల్ని కూల్చివేశారని అనుమానం వ్యక్తమవుతోంది. ఈ సంఘటన విషయమై ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా బుధవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సత్యవ్రత్‌, రమేశప్ప, రమేశ్‌ సంఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులకు వివరించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

మునిపల్లి(అందోల్‌): ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తున్న సందర్భంగా సైబర్‌ నేరస్తులు ఎదో బ్యాంకు పేరు చెప్పి వాట్సాప్‌ యాప్‌ ఏపీకే లింక్‌ ఫైల్‌ పంపిస్తున్నారని దీంతో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్‌ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్‌ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కొండగుట్టకు రారండి..

నేటి నుంచి టేకూర్‌లో మొహర్రం ఉత్సవాలు

భారీగా తరలిరానున్న భక్తులు

మొహర్రం పండగ వచ్చిందంటే ఆ గ్రామంలో భక్తుల సందడి నెలకొంటుంది. గ్రామం పక్కనే ఉన్న కొండగుట్టపై దర్గా ఉంది. దర్గాను దర్శించుకునేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు సమీపంలోని కర్నాటక రాష్ట్రం నుంచి అధికసంఖ్యలో భక్తులు దూది పీర్లతో వేలసంఖ్యలో తరలివస్తారు. ఏళ్ల నాటి నుంచి జిల్లాలోనే మొహర్రం వేడుకలకు టేకూర్‌ గ్రామం ప్రతీకగా నిలుస్తోంది. ఈ గ్రామానికి దశాబ్దాల చరిత్ర ఉంది. జిల్లాలో అంతటా మొహర్రం పండుగ ముగిసినా.. టేకూర్‌లో మాత్రం మరుసటి రోజు నుంచి మొహర్రం వేడుకలు నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత.

– న్యాల్‌కల్‌(జహీరాబాద్‌)


దర్గా వద్దకు వెళ్లేందుకు ఉన్న ప్రధాన దారి


ప్రత్యేక అలంకరణలో మైబుసుభానీ

మండల పరిధిలోని టేకూర్‌ గ్రామం పక్కనే ఉన్న కొండగుట్టపై మహిమాన్వితమైన దర్గా ఉంది. ఆ దర్గాను దర్శించుకునేందుకు ఇసుక వేస్తే రాలనంత జనం కనబడుతారు. కుల, మతాలతో సంబంధం లేకుండా అన్నివర్గాల వారు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. గ్రామం నడిబొడ్డున డప్పుల మోత మధ్యన నృత్యాలు చేస్తూ రుమాళ్ల ఆటతో పాటు ఇతర ఆటలు ఆడుతూ ఆకట్టుకుంటారు.

దూది పీర్లతో సందడి చేస్తూ...

జిల్లాలోనిలోని మాయికోడ్‌, ముంగి, చినిగెపల్లి, జబ్లి, ధర్మాపూర్‌, నాగులపల్లి, హస్నాబాద్‌, మందాపూర్‌, మైకోడ్‌, ఒకరాన, ధన్నారం, ఉసిర్కేపల్లి, కర్నాటకలోని మైలూర్‌ తదితర ప్రాంతాలతో పాటు కర్నాటకలోని పలు ప్రాంతాలకు చెందిన సుమారు 30 వరకు దూదిపీర్లు గ్రామానికి వస్తాయి. వివిధ ప్రాంతాల నుంచి పీర్లతో వచ్చిన ప్రజలు గుట్టపై ఉన్న దర్గాకు వెళ్లి దర్శనం చేసుకుంటారు.

నబీసాబ్‌ సమాధి దర్శనానికి బారులు

గుట్టపై ఉన్న మైబుసుభాని దర్గాను దర్శించుకునేందుకు వెళుతున్న క్రమంలో కింది భాగంలో నబీసాబ్‌ సమాధిని బారులు తీరి దర్శించుకుంటారు. నబీసాబ్‌ జీవించి ఉన్నప్పుడు పలు మహిమలు చూపేవాడని, పీర్లకు శక్తిని నింపేవాడని అందుకే దూది పీర్లు ఇక్కడకు వస్తాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.


రుమాళ్ల ఆట ఆడుతున్న భక్తులు (ఫైల్‌)

మహిమాన్వితమైన దర్గాగా గుర్తింపు

టేకూర్‌ గ్రామం సమీపంలో గుట్టపై ఉన్న గుహలో వందల ఏళ్ల క్రితం వెలసిన మైబుసుభాని దర్గా మహిమ వల్లే ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున దూది పీర్లు ఇక్కడికి వస్తాయని, మైబుసుభానిని దర్శించుకుంటే ఏ రోగాలు రావని భక్తుల నమ్మకం.

రాత్రంతా ఆటపాటలతో సందడి

వివిధ ప్రాంతాల నుంచి పీర్లతో వచ్చే భక్తులు రాత్రంతా ఆటలు ఆడుతూ.. పాటలు పాడుతూ నాటకాలు ప్రదర్శిస్తారు. వారికి ఇబ్బందులు కలగకుండా దర్గా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువారం ప్రారంభమయ్యే మొహర్రం ఉత్సవాల్లో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జహీరాబాద్‌ డీఎస్పీ అధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రతి ఏడాది అన్నదానం

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

రెండు రోజుల పాటు నిర్వహించే మొహర్రం ఉత్సవాలకు గ్రామస్తులు, యువజన సంఘం సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధాన కూడలి వద్ద ఉన్న ఆశుర్‌ఖానాను అందంగా అలంకరించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రుమాళ్ల ఆటతో పాటు ఇతర ఆటలు ఆడేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచే వచ్చే భక్తులకు కుల, మత బేధాలు లేకుండా అన్నివర్గాల వారు తలకొంత డబ్బును పోగు చేసి ప్రతి ఏడాది అన్నదానం చేస్తారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు చేశాం



రెండు రోజుల పాటు నిర్వహించే మొహర్రం ఉత్సవాలకు జిల్లాలోని ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారు. కుల, మతాలకు అతీతంగా అందరం కలిసి పండుగను ఘనంగా నిర్వహిస్తాం. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశాం.

– అమీర్‌, మాజీ సర్పంచ్‌, టేకూర్‌

భక్తులు సహకరించాలి



మొహర్రం ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశాం. ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలి.

– నయిమొద్దీన్‌, సీఐ, జహీరాబాద్‌ రూరల్‌

దివ్యాంగులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న రవికుమార్‌

పటాన్‌చెరు టౌన్‌: దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ మస్క్యులర్‌ డిస్ట్రోఫీ అసోసియేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్‌ అన్నారు. మండల పరిధిలోని ఇస్నాపూర్‌ రామాలయం ఆవరణలో కండర క్షీణిత వ్యాధి బాధితుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా కోసం మేము అనే నినాదంతో కదిలి ప్రత్యేక సదుపాయాలే సాధన లక్ష్యంగా పదేళ్లగా బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంతో టీఎండీఏ రాష్ట్ర కార్యవర్గం, వివిధ జిల్లాల కో–ఆర్డినేటర్లతో కలిసి పలుమార్లు అధికారులు, మంత్రులను కలిసినా పెన్షన్‌ పెంపుదల, కేర్‌ టేకర్‌ అలవెన్సులు వంటివి సదుపాయాలను సాధించుకోలేకపోయామని వాపోయారు. ప్రస్తుతం కాంగ్రెస్‌ ప్రభుత్వమైన 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం దివ్యాంగులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇస్నాపూర్‌ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కంచిగారి మహేష్‌, కార్యదర్శి కంజర్ల జ్యోతి, సలహాదారులు కంచిగారి శ్రీనివాస్‌, సాయిలు బుజ్జి మహేష్‌ వికలాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

జిల్లావ్యాప్తంగా మొహర్రం పండగను భక్తులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. పీర్లను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో హాజరై మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణాలు, గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది.


హత్నూరలో...


జహీరాబాద్‌ పట్టణంలో...


సదాశివపేట పట్టణంలో...


కల్హేర్‌: మొహర్రం వేడుకల్లో పాల్గొన్న భక్తులు


జిన్నారంలో...


కంది: కలివేముల గ్రామంలో...


సంగారెడ్డి టౌన్‌లో..

భద్రత కోసమే 'మై ఆటో ఈజ్‌ సేఫ్‌'


ఆటోడ్రైవర్లకు స్టిక్కర్లను అందజేస్తున్న పోలీసులు

పటాన్‌టౌన్‌: ఆటోలో ప్రయాణించే వారి భద్రత కోసమే 'మై ఆటో ఈజ్‌ సేఫ్‌' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీడీఎల్‌ సీఐ స్వామిగౌడ్‌ అన్నారు. మండల పరిధిలోని భానూర్‌ బీడీఎల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆటోలకు బుధవారం 'మై ఆటో ఈజ్‌ సేఫ్‌' స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..ప్రతి ఆటోడ్రైవర్‌ డ్రైవింగ్‌ లైసెన్స్‌తో పాటు ఆటోకు సంబంధించిన పత్రాలను సమర్పించి స్టిక్కర్లను పొందాలని సూచించారు. ఆటోలో ప్రయాణం చేస్తున్న సమయంలో ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించినా, అసభ్యంగా మాట్లాడినా, ర్యాష్‌ డ్రైవింగ్‌ చేసినా సీట్‌ వెనకాల పోలీస్‌శాఖ ఏర్పాటు చేసిన 'మై ఆటో ఈజ్‌ సేఫ్‌' క్యూఆర్‌ కోడ్‌ను స్కాన్‌ చేసి సంబంధిత ఆప్షన్‌ను సెలెక్ట్‌ చేసుకొని సబ్మిట్‌ చేయాలని సూచించారు. దీంతో కంట్రోల్‌ రూమ్‌తో పాటు సంబంధిత కంప్లైంట్‌కి సమాచారం రాగానే సిబ్బంది స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చి సహాయపడతారని తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్‌

జహీరాబాద్‌: రౌడీషీటర్లు కుటుంబ, భూవ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే పీడీ యాక్ట్‌ నమోదు చేస్తామని డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. టౌన్‌ సీఐ రవి, ఎస్‌ఐ కాశీనాథ్‌లతో కలిసి పలు కేసుల్లో నిందితులుగా, నేర చరిత్ర కలిగి ఉన్న రౌడీషీటర్లతో వారి ఇళ్లకు వెళ్లి మాట్లాడి కౌన్సెలింగ్‌ ఇచ్చారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు మంచి ప్రవర్తనతో జీవించాలని సూచించారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా, హింసించినా కఠిన చర్యలు తప్పవన్నారు.

రౌడీషీటర్ల స్థితిగతులపై ఆరా...

పటాన్‌చెరు టౌన్‌: రౌడీషీటర్ల స్థితిగతులపై సీఐ ప్రవీణ్‌రెడ్డి క్రైమ్‌ సీఐ రాజు తో కలిసి బుధవారం రౌడీషీటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఏ పని చేస్తున్నారని వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్రిమినల్‌ యాక్టివిటీస్‌లో జోక్యం చేసుకోవద్దని సూచించారు. రౌడీషీటర్లపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు.

పాత నేరస్తులపై నిఘా

కల్హేర్‌(నారాయణఖేడ్‌): పాత కేసుల్లో నేరస్తులపై నిఘా పెట్టినట్లు కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి, మునిగేపల్లి, నాగధర్‌, రాంచందర్‌ తండాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన చోరీ కేసులు, రౌడీషీటర్ల వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేశం పాల్గొన్నారు.

మహిళ మెడలోంచి గొలుసు అపహరణ

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): అంగన్‌వాడీ టీచర్‌ మెడలో నుంచి చైన్‌ లాక్కెళ్లిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. సీఐ మహేష్‌గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నందికంది గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్‌ గంగోజుపేట శ్రీలత మంగళవారం సాయంత్రం తన విధులను ముగించుకొని ఇంటికి వెళ్తుంది. గ్రామంలోని మల్లన్న ఆలయం సమీపంలో నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా ఆమెను అనుసరించిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు గొలుసును లాక్కొని మోటార్‌ సైకిల్‌పై అక్కడి నుంచి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాల కార్మికులకు విముక్తి

పటాన్‌చెరు: ఇద్దరు బాల కార్మికుల చేత పనిచేయిస్తున్న దుకాణ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆపరేషన్‌ ముస్కాన్‌ భాగంగా పోలీసులతో కలిసి తనిఖీలు చేపట్టగా మండల పరిధిలోని ముత్తంగిలో ఉన్న ఎంకే స్టీల్‌ ట్రేడర్స్‌లో ఇద్దరు మైనర్లు పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఇద్దరు బాలురు చేత పని చేయిస్తున్నందునా దుకాణ నిర్వాహకుడు తాఖీద్దీన్‌పై అసిస్టెంట్‌ లేబర్‌ ఆఫీసర్‌ వీరేశం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో బాల కార్మిక చట్టం కింద దుకాణ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి మృతి

పటాన్‌చెరు టౌన్‌: చికిత్స పొందుతూ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘాట్‌కేసర్‌కు చెందిన సుమంత్‌(30) అమీన్‌పూర్‌ పరిధిలోని వీరాంజనేయ రెసిడెన్సిలో భార్య సౌమ్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. అయితే అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్‌ను ఈఎంఐ ద్వారా కొనుగోలు చేశాడు. దీనికి తోడు కొంతకాలంగా సుమంత్‌ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో అతడి భార్య తల్లిగారి ఇంటికి వెళ్లగా ఈ నెల 12వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు చందనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతుడి తండ్రి మధుసూదన్‌రావు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్పొరేషన్‌ చైర్మన్లకు ఎంపీ అభినందన


శారదను సన్మానిస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్‌

నారాయణఖేడ్‌: రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్‌ చైర్మన్‌గా జైపాల్‌, రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద బుధవారం హైదరాబాద్‌లోని ఆయా కార్పొరేషన్ల కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జహీరాబాద్‌ ఎంపీ సురేష్‌ షెట్కార్‌, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీగౌడ్‌, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు కైలాస్‌ శ్రీనివాస్‌తో కలిసి ఎంపీ ఆయా కార్యాలయాలకు వెళ్లి వారిని ఘనంగా సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఏకలవ్య జయంతి ఉత్సవాలు**



జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల గ్రామంలో ఎరుకల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏకలవ్య జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్యుడి విగ్రహానికి ఆ సంఘం నాయకులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో నాయకులు వినోద్‌, వీరేశం, సుధ, మైసయ్య, యాదగిరి పాల్గొన్నారు.

◆ **పామాయిల్‌ సాగుపై అవగాహన**

కల్హేర్‌(నారాయణఖేడ్‌): మండలంలోని కృష్ణాపూర్‌ రైతు వేదికలో బుధవారం పామాయిల్‌ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోద్రెజ్‌ కంపెనీ మెనేజర్‌ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో పామయిల్‌ మొక్కలు పెంచి ఎక్కువ లాభాలు పొందాలని సూచించారు. మాజీ జెడ్పీటీసీ నర్సింహరెడ్డి, మాజీ కోఆప్షన్‌ మెంబర్‌ డాక్టర్‌ అలీ, మాజీ సర్పంచ్‌ కిష్టారెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌ ఈశ్వర్‌, ఏఈఓ కృష్ణవేణి పాల్గొన్నారు.

◆ **సీసీ రోడ్డు పనులు ప్రారంభం**



హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని సాదుల్లానగర్‌లో ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన నిధులతో సీసీ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్‌, నాయకులు అంజయ్య, విశ్వనాథం, పెంటయ్య, ప్రసాద్‌ పాల్గొన్నారు.

◆ **ఉచిత వైద్య శిబిరం**

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని లోపలికోట హనుమాన్‌ మందిరంలో మెడి స్టార్‌ అస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పాల విజయ్‌కుమార్‌, మెడి స్టార్‌ అసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

◆ **దెబ్బతిన్న రోడ్ల పరిశీలన**

జహీరాబాద్‌ టౌన్‌: మండల పరిధిలోని బూచినెల్లి పారిశ్రామికవాడలోని రోడ్లను మంగళవారం సీఐటీయూ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ క్లస్టర్‌ కన్వీనర్‌ మహిపాల్‌ మాట్లాడుతూ పారిశ్రామికవాడలో రోడ్లు దెబ్బతిని గుంతలమయంగా మారాయన్నారు. ఇండస్ట్రియల్‌ ఏరియాలో స్ట్రీట్‌ లైట్లు కూడా లేవని తెలిపారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు రాజిరెడ్డి, సందీప్‌రెడ్డి, గణేష్‌, శ్రీధర్‌, బాలరాజ్‌, సూరి, పాష, ప్రకాష్‌, రాజు పాల్గొన్నారు.

◆ **ఘనంగా నారాయణ హోమం**



ఝరాసంగం(జహీరాబాద్‌): ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్‌ దత్తగిరి మారాజు ఆశ్రమంలో గురు పౌర్ణమి వేడుకలు ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్‌, డాక్టర్‌ సిద్దేశ్వర స్వామి ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు, హోమం, యజ్ఞం నిర్వహించారు. మాతృశ్రీ అనసూయ మాత, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి

జిన్నారం(పటాన్‌చెరు): తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో గల దేవాలయాలు బుధవారం కిటకిటలాడాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): మండల పరిధిలోని రేజింతల్‌, ముంగి, రాఘవాపూర్‌, మల్గి గ్రామాల్లో ప్రధాన దేవాలయాలు సిద్దివినాయక, ఆదిలక్ష్మి ఆశ్రమం, పంచవటి క్షేత్రం, పాండురంగ మందిరాలు భక్తులతో సందడిగా మారాయి.

కంగ్టి(నారాయణఖేడ్‌): మండలంలోని సిద్దేశ్వర ఆలయంతో పాటు ఎంపల్లి కాశీవిశ్వనాథ ఆలయంలో భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు.

జహీరాబాద్‌: పట్టణంలోని రుక్మిణీ పాండురంగ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు సామూహిక భగవద్గీత పారాయణం చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బెజుగం రాజగోపాల్‌, నాయకులు రవికిరణ్‌, కృష్ణ, శ్రీనివాస్‌, బాలచందర్‌, మంకాల్‌ సుభాష్‌, కల్పన, పద్మ పాల్గొన్నారు.

సంగారెడ్డి టౌన్‌: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపురంలో భక్తులు వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నారాయణఖేడ్‌: డివిజన్‌ పరిధిలో తొలి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్షలలో ఉన్నవారు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. అనంతరం ఉపవాస దీక్షలు విరమించారు.

మునిపల్లి(అందోల్‌): తొలి ఏకాదశి సందర్భంగా జీవన్ముక్త సంస్థానంలో సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్‌ మహారాజ్‌ పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు

జహీరాబాద్‌ టౌన్‌: తొలి ఏకాదశిని పురస్కరించుకుని పట్టణంలోని మహీంద్ర కాలనీలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను వితరణ చేశారు.